సాక్షి
సూర్యాపేట
మంగళవారం ı 4 ı ఏప్రిల్ ı 2023



లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు
లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌ఓ కోటాచలం హెచ్చరించారు.
- 8లో



సర్వర్ డౌన్‌తో నిలిచిన పరీక్ష
న్యాయశాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు మూడోసెషన్‌లో నిర్వహించిన పరీక్షను వాయిదా వేశారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
38°/25°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించి దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, జెడ్పీ సీఈఓ సురేష్ , కలెక్టరేట్ ఏఓ శ్రీదేవి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

సూర్యాపేటటౌన్ : జిల్లా పరిషత్ కార్యాలయంలో 1, 7, 2, 4వ స్థాయీ సంఘాల సమావేశాలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ గుజ్జ దీపిక అధ్యక్షతన ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సమాజశ్రేయస్సుకు పరితపించే వ్యక్తి 'ఈదర'



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కోదాడఅర్బన్ : నిత్యం సమాజ శ్రేయస్సుకు పరితపించే వ్యక్తి రిటైర్డ్ హెచ్ఎం దివంగత ఈదర సత్యనారాయణ అని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కొనియాడారు. సోమవారం పట్టణంలోని ఎల్డర్స్ రిక్రియేషన్ సొసైటీ ఫంక్షన్ హాల్‌లో పబ్లిక్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మేకల వెంకట్రావు అధ్యక్షతన పబ్లిక్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ హెచ్ఎం ఈదర సత్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. ఇందులో వారు హాజరై ఈదర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యమ నేతగా, పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడిగా అందరి ఆదరాభిమానాలు చూరగొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని బాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అందె సత్యం, సీపీఎం నాయకులు వెంకటేశ్వరరావు, ముత్యాలు, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, దొడ్డా నారాయణరావు, కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, పట్టణ వైద్యుడు జాస్తి సుబ్బారావు, సీతారామయ్య, వెంకటేశ్వరరావు, రామారావు, అరుణ, శ్రీనివాసరావు, భాస్కర్, శ్రీనివాసరెడ్డి, అప్పారావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు జరిగాయి. శ్రీస్వామి వారికి నిత్యపూజలు చేసిన అనంతరం మండపంలో నిత్య రుద్ర హవనం గావించారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు, ముఖ మండపంలోని స్ఫటిక లింగానికి పూజలు నిర్వహించి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

ధర రాలే.. దురద వచ్చె!

- ఆర్నెళ్లుగా ఇంట్లోనే పత్తి నిల్వలు
- రైతులు నిరీక్షించినా క్వింటా రూ.7,500 దాటని ధర
- తెల్లబంగారంలో పురుగులతో చర్మ వ్యాధులు
- దద్దుర్లతో రైతు కుటుంబాలు అవస్థలు



ఈ ఫొటోలో కన్పిస్తున్న రైతు పేరు సూదిరెడ్డి శేఖర్ రెడ్డి. సొంతూరు ఆత్మకూర్ (ఎస్). వానాకాలంలో 3 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. పెట్టుబడి అధికంగా పెట్టినా దిగుబడి మాత్రం 14క్వింటాళ్లే వచ్చింది. మొదట్లో క్వింటాకు రూ.9వేలు ధర పలికింది. ముున్ముందు మరింత రేటు వస్తుందని ఆశించి ఇంట్లో పత్తి నిల్వ ఉంచాడు. అయినా ధర పెరగలేదు. దాదాపు ఐదారు నెలలుగా ఇంట్లో పత్తి నిల్వ ఉండడంతో పురుగులు ఆశించాయి. దీంతో అందరికీ చర్మ సంబంధ వ్యాధులు మొదలయ్యాయి. ఎన్ని మందులు వాడినా తగ్గడంలేదు.

భానుపురి (సూర్యాపేట) : ఇళ్లల్లో నిల్వ ఉంచిన పత్తి.. రైతు కుటుంబాలకు ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతోంది. రేటు పెరుగుతుందని ఆశించి ఆర్నెళ్లుగా ఇంట్లో దాస్తే.. పురుగులు ఆశించి చర్మ సంబంధ సమస్యలు మొదలయ్యాయి. వళ్లంతా దురద కారణంగా కంటిమీద కునుకులేకుండా పోయింది. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో తెల్లబంగారానికి ధర పెరగకపోగా.. రోజురోజుకూ తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



రైతు ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

ఆశించిన స్థాయిలో పెరగని పత్తి ధర

జిల్లావ్యాప్తంగా 2022–23 వానాకాలం 98,586 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. అధికంగా కురిసిన వర్షాల కారణంగా పంటలు దెబ్బతినగా.. విపరీతమైన కలుపు పుట్టి కూలీల ఖర్చు రెట్టింపయ్యింది. ఈ క్రమంలో పంట దిగుబడి తగ్గిపోయి పెట్టుబడులు అధికమయ్యాయి. ప్రధానంగా కలుపు, పత్తితీతకు కూలీల కొరత కారణంగా వారు అడిగినంత ఇవ్వాల్సి వచ్చింది. చాలామంది రైతులు మొదట్లో తీసిన పత్తి (మైల పత్తి)ని ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పాడైపోయే పరిస్థితి ఉంటుందని వెంటవెంటనే విక్రయిస్తుంటారు. ఇక పంట పెట్టుబడి కోసం అప్పులు తెచ్చిన రైతులు తీసిన పత్తి తీసినట్లుగానే అమ్ముతుంటారు. కాగా గతేడాది అనూహ్యంగా మద్దతు ధరకు రెట్టింపు పలకడంతో రేటు పెరుగుతుందని గంపెడాశలు పెట్టుకున్నారు. రైతులు ఆశపడిన విధంగానే అక్టోబర్‌లో రూ.10వేలకు చేరువైంది. తర్వాత రోజురోజుకు పడిపోతూ వస్తోంది. అప్పులు ఇచ్చిన వాళ్లు అడుగుతున్నా మంచి ధర వస్తుందన్న నమ్మకంతో పత్తిని అకమ్ముకుండా ఇంట్లో నిల్వ చేసుకున్నారు. దాదాపు ఆర్నెళ్లుగా నిరీక్షించినా ఫలితంలేదు. ప్రస్తుతం క్వింటా పత్తి రూ.7500కు చేరకపోవడం గమనార్హం.

కొత్తసమస్య..!

ఊహించిన మేర దిగుబడి, ధర రాకపోవడంతో పాటు రైతాంగాన్ని కొత్త సమస్య ఇబ్బంది పెడుతోంది. అప్పుల భారాలు ఉండగానే ఇంట్లో నిల్వ ఉన్న పత్తి కారణంగా కుటుంబ సభ్యులందరికీ చర్మ సంబంధ వ్యాధులు వస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు, మంచి దిగుబడి రావాలన్న ఆశతో రైతులు అధిక మోతాదులో వివిధ రకాల పురుగుల మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ పురుగుల మందు ప్రభావం, ఎక్కువ రోజులు పత్తిని ఇళ్లలోనే నిల్వ ఉంచడంతో పత్తికి పురుగులు పడుతున్నాయి. ఈ పురుగులు ఇళ్లలో తిరుగుతున్నాయి. వీటి కారణంగా కుటుంబ సభ్యులందరికీ విపరీతంగా దురద వస్తోంది. ఇక చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న ఇళ్లలో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎన్ని మందులు వాడినా తగ్గినట్లే తగ్గి మళ్లీ మొదలవుతోంది.

ధర లేక ఇబ్బంది పడుతున్నాం



పత్తి పంటకు మంచి ధర రావడం లేదు. గతంలో ఎన్నడూలేనివిధంగా పెట్టుబడులు ఈ సారి రెట్టింపయ్యాయి. మొదట్లో పత్తిని అమ్ముకున్న తూకంలోనైనా కలిసొచ్చేది. అప్పులు కట్టేవాళ్లం. ధర పెరుగుతుందని నమ్మి అమ్మకుండా ఉన్నాం. అప్పులు పెరిగిపోగా.. ధర మాత్రం అలాగే ఉంది.

– బుడిగెబోయిన లింగయ్య, రైతు ఏపూరు

దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



కలెక్టరేట్‌లో కొమురయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్యను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి నడిపించిన వ్యక్తి కొమురయ్య అని కొనియాడారు. తెలంగాణ పేరును రూపుమాపాలనే సమయంలో పోరాటం చేసిన ఆయనను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా జరిపిస్తోందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ బీసీ అభివృద్ధి అధికారి అనసూయ, డీడబ్ల్యూఓ జ్యోతిపద్మ, బీసీ సంక్షేమ సంఘం నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల పంటలు సాగు చేయాలి

జిల్లాలోని రైతులు చిరు ధాన్యాల పంటలు సాగు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కోరారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోషక ఆహార ప్రదర్శనను మంత్రి.. జిల్లా అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత్‌కేశవ్, మోహన్‌రావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను కూడా వివరించాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారిణి జ్యోతిపద్మ మాట్లాడుతూ పోషణ్ పక్వాడ 2023లో భాగంగా మార్చి 20 నుంచి ఏప్రిల్ 3 వరకు జిల్లాలోని గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనతకు గల కారణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు ,సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి

పదో తరగతి పరీక్షలు ప్రారంభం



సూర్యాపేటలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు తదితరులు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు తెలుగు, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 69 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 12,221 మంది రెగ్యులర్ విద్యార్థులకు 12,187 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరైనట్టు డీఈఓ అశోక్ తెలిపారు. 48 మంది ప్రైవేట్ విద్యార్థులకు 41 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరైనట్టు చెప్పారు. పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా తనిఖీలు చేసింది. పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగినట్టు డీఈఓ తెలిపారు.



హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటూ..

సమాజాభివృద్ధికి తోడ్పడాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సమాజాభివృద్ధికి అంతా తోడ్పడాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.మోహన్‌రావు కోరారు. ఈనెల 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి, 14న అంబేద్కర్ జయంతిలను పరిస్కరించుకొని వేడుకల నిర్వహణపై జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి, డీఎస్పీ నాగభూషణంలతో కలిసి సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, సంఘం నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని, వారు చూపిన మార్గంలో నడవాలని కోరారు. సామాజిక మార్పుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, పెన్‌పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, దళిత, సామాజిక సంఘాల నాయకులు అంజయ్య, రాములు, గోపి, హసన్, రాజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

లక్ష్యం నెరవేరలే..

- ఆర్థిక సంవత్సరం ముగిసినా పంచాయతీల్లో 82.44 శాతమే ఇంటి పన్ను వసూలు
- రూ.11.51కోట్లకు .. వసూలైంది రూ.9.49కోట్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పల్లెల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతే పల్లె ప్రగతి సాధ్యమవుతుంది. కానీ ఆర్థిక సంవత్సరం ముగిసినా గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూలు లక్ష్యం చేరుకోలేదు. వందశాతం పన్నులు వసూలు చేస్తామన్న అధికారుల మాటలు నెరవేరలేదు. జిల్లాలో కేవలం రూ.82.44శాతం మాత్రమే వసూలు చేయగలిగారు.

రూ.2.02కోట్లు పెండింగ్

జిల్లాలో 23 మండలాలు ఉండగా, 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,55,913 నివాసాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 2022– 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు, పన్నేతర చార్జీల రూపంలో జిల్లాలో రూ.11, 51,45,824 వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో రూ. 70,00,520 పాత బకాయిలు కాగా 2022–23 ఆర్థిక సంవత్సర పన్నులు రూ. 10,81,45,304గా లెక్క కట్టారు. అయితే ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసిన విషయం విదితమే. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 9,49,27,963లను వసూలు చేశారు. ఇంకా రూ. 2,02,10,949 కోట్లు బకాయిలు ఉన్నాయి. అంటే జిల్లాలో 82.44 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయన్నమాట.

పన్నుల ఖర్చు ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ గ్రాంట్‌లతో పాటు గ్రామాల అభివృద్ధికి పంచాయతీ పన్నులే దిక్కు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర వాటికి పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. పల్లె ప్రగతి పనుల నిర్వహణ, ట్రాక్టర్, వాటర్ ట్యాంక్ నిర్వహణతో పాటు మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలను ఇచ్చేందుకే ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోతున్నాయి. పంచాయతీలకు ట్యాక్స్‌ల రూపంలో వచ్చే ఆదాయం చిన్న, చిన్న పనుల నిర్వహణకు వినియోగించే అవకాశం ఏర్పడుతుంది. వంద శాతం పన్నులు వసూలైతేనే అది సాధ్యం.

టెంట్లు లేవు.. మెడికల్ కిట్లు లేవు

- ఉపాధి పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- సౌకర్యాల కల్పనపై దృష్టిసారించని అధికారులు

నాగారం : ఉపాధి పనుల నిర్వహణకు పెద్ద పీట వేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. పని ప్రదేశాల్లో సరైన వసతులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండలోనే కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. కూలీల వలసలు నిరోధించడానికి, ఉన్న గ్రామంలోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. దీనిని విజయవంతంగా చేపట్టేందుకు నూతన సాంకేతికతను అమల్లోకి తీసుకొచ్చింది. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్ఎంఎంఎస్)ను ప్రవేశపెట్టింది. వచ్చిన వారి ఫొటోను ఉదయం పని ప్రదేశం నుంచే తీసి పోర్టల్‌లో నమోదు చేయడం, పనులు పూర్తయిన తరువాత మళ్లీ ఫొటో తీసి నిక్షిప్తం చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అలాగే గతంలో రోజుకూ సరాసరి కూలి రూ.242 ఇచ్చే వారు, దానిని రూ.250కి పెంచగా, తాజాగా మరో రూ.15 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదంతా బాగానే ఉన్నా.... కూలీలకు కనీస వసతుల కల్పన విషయాన్ని మాత్రం మర్చిపోయింది.



పస్తాల గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

పంచాయతీలు	జాబ్‌కార్డుల సంఖ్య
475	2,61,106
నమోదైన కూలీల సంఖ్య	
6,16,057	
ప్రస్తుతం పనులకు వెళ్తున్న కూలీల సంఖ్య	
27,257	

రోజుకు 27వేల మంది..

జిల్లాలో 23 మండలాల పరిధిలో 475 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2,61,106 జాబ్‌కార్డులు ఉండగా 6,16,057 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 27,257 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రస్తుతం కాలువలు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, ఫీడర్ చానల్, నర్సరీలు, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, క్రీడాప్రాంగణాలు, కందకాలు, రోడ్డవెంట ఉన్న కంపచెట్ల తొలగింపు తదితర పనులను చేపడుతున్నారు.

సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నాం



పని ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బందులు కలగకుండా దృష్టి సారిస్తున్నాం. పని చేసేచోట సౌకర్యాల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించాం. వేసవిలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ, సూర్యాపేట

సేదదీరడానికి చెట్లను ఆశ్రయిస్తున్న కూలీలు

ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ఉపాధిహామీ పనులు చేసేచోట కనీస వసతులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీడ కోసం గతంలో సమకూర్చిన టెంట్లు పనికి రాకుండా పోయాయి. మళ్లీ వాటి మంజూరుపై రెండేళ్లుగా ఎలాంటి స్పష్టత లేదు. నీడ లేక ఉపాధి కూలీలు ఎండలకు కాస్తంత సేద దీరడానికి చెట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అలాగే గతంలో కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా ఒక కూలీని నియమించేవారు. ఈ విధానాన్ని తొలగించి ఒక్కో కూలీకి నీటి కోసం అదనంగా రూ.5 ఇచ్చేవారు. దీంతో కూలీలు ఇంటి నుంచే నీళ్ల బాటిళ్లను తెచ్చుకుంటున్నారు. కానీ ప్రస్తుతం తాగునీటి ప్రోత్సాహకం ఊసేలేదు. కూలీలకు పని చేసినందుకు మాత్రమే కూలి చెల్లిస్తున్నారు. అలాగే పని ప్రదేశాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలనే నిబంధనలు ఉన్నా ఎక్కడా కన్పించడం లేదు.

హామీలు అమలు చేయాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన డిమాండ్ చేశారు. చింతలపాలెంలో మండల మహిళా సమాఖ్య విస్తృత స్థాయి సమావేశం మండల అధ్యక్షురాలు భీమిశెట్టి పద్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ బీజేపీ హటావో దేశ్ కో బచావో నినాదంతో నిర్వహిస్తున్న ప్రచార చైతన్యయాత్ర ఏప్రిల్ 14న చింతలపాలెం వస్తున్నట్లు ఆమె చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి ఎర్ర జెండా ఊపి ప్రచార జాతా, చైతన్య యాత్రను ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. ఏప్రిల్ 14, 15, 16 తేదీల్లో చింతల పాలెం మండలంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వి. కోటమ్మ, హైమావతి, ఎస్. చంద్రకళ, జాన్‌బీ, అలివేలు వీరమ్మ పాల్గొన్నారు.



చింతలపాలెంలో మాట్లాడుతున్న సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

జిల్లా జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు



ప్రధాన న్యాయమూర్తిని కలిసిన తుంగతుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు

చివ్వెంల(సూర్యాపేట) : ఇటీవల నూతనంగా ఎన్నికైన సూర్యాపేట, తుంగతుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.గౌతం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా బార్ అసోసియేషన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు నిర్వహించారు. సుప్రభాతసేవ, నిత్యహోమం చేశారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. విశ్వక్సేన పూజ, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మాంగళ్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


సతీష్‌రెడ్డి (ఫైల్)

మునగాల (కోదాడ): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలమర్రి గ్రామానికి చెందిన మెండు గోపాల్ రెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు మెండు సతీష్‌రెడ్డి(34) వరికోత మిషన్లను లీజుకు తీసుకొచ్చి నడిపిస్తుంటాడు. సతీష్‌రెడ్డి తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లితో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. సోమవారం గ్రామ శివారులో వరి పొలం కోస్తుండగా వరికోత మిషన్‌కు 11కేవీ వైర్లు అడ్డురావడంతో వాటిని కర్రతో పైకి లేపే ప్రయత్నం చేశాడు. దీంతో వైర్లు తెగి మీద పడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం బంద్

నడిగూడెం: పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టని సంఘటన సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చోటుచేసుకుంది. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదో తరగతి పరీక్ష జరిగింది. అనంతరం ఇదే పాఠశాలకు చెందిన ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఒంటిగంటకు పాఠశాలకు వచ్చారు. అయినప్పటికీ మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంటలు వండ లేదు. దీంతో పలువురు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తినగా మరికొందరు విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. సంబంధిత ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఆకలికి అలమటించాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన రైతు మీసాల వెంకన్నకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ చోరీ గురైన విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21వ తేదీ రాత్రి మీసాల వెంకన్న ఇంటి ముందు తన ట్రాక్టర్ ట్రాలీని ఉంచాడు. మరుసటి రోజు ఉదయాన్నే చూసేసరికి ఆ ట్రాలీ కనిపించలేదు. ఇన్ని రోజులు చుట్టుపక్క గ్రామాల్లో ఎంత వెతికినా ట్రాలీ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతుల తెలిపాడు. ఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

టీజీఓస్ డైరీ ఆవిష్కరణ

నల్లగొండ : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నల్లగొండ జిల్లా క్యాలెండర్, డైరీని కేంద్ర సంఘం అధ్యక్షురాలు మమతతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి పుల్లెంల రవీందర్‌కుమార్‌గౌడ్, ముజీబుద్దీన్, ఎం.శ్రీనివాసులు, గోన మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జానకిపురం ఎన్‌కౌంటర్‌కు ఎనిమిదేళ్లు

- అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన
- ఉగ్రవాదుల కాల్పుల్లో అమరులైన ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు
- చివరకు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులు



ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు (ఫైల్)



కాల్పుల్లో మృతి చెందిన ఉగ్రవాదులు అస్లాం అయూబ్, జాకీర్ బాదల్

మోత్కూరు: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోత్కూరు మండలం జానకిపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి మంగళవారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఏప్రిల్ 4, 2015న జానకిపురం గ్రామ శివారులో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అప్పటి ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ సిద్దయ్యతో పాటు అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ చొగోని నాగరాజు అమరులయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అప్పటి రామన్నపేట సీఐ బాలగంగిరెడ్డి, పోలీసు సిబ్బందికి, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీఐ బాలగంగిరెడ్డికి గాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది జరిపిన కాల్పుల్లో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు అస్లాం ఆయూబ్, జాకీర్ బాదల్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎన్‌కౌంటర్‌కు ముందు రోజు సూర్యాపేట బస్టాండ్‌లో ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యారు. వారి కోసం పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఉగ్రవాదులు అర్వపల్లి దర్గా ప్రాంతంలో తలదాచుకొని తిరుమలగిరి మీదుగా మోత్కూరు మండలం చిర్రగూడూరు నుంచి డొంక మార్గం గుండా వెళ్తూ దారితప్పి జానకిపురం గ్రామ శివారుకు చేరుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బైక్‌పై వెళ్లగా బైక్ వాగులోని ఇసుకలో కూరుకుపోవడంతో మరో బైక్ తీసుకొని గ్రామ శివారులోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వచ్చిన పోలీసు వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ సీటులో ఉన్న కానిస్టేబుల్ నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, ఎస్‌ఐ సిద్దయ్య పొట్ట, తలలోకి తూటాలు దిగడంతో కుప్పకూలిపోయాడు. వారిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం ఎస్‌ఐ సిద్దయ్య మృతిచెందాడు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులను యావత్ దేశ ప్రజలు అభినందించారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

- రూ.10వేల జరిమానా విధించిన కోర్టు


నిందితురాలు బసవరేఖ

భూదాన్‌పోచంపల్లి: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను చంపిన భార్యకు సోమవారం భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు జీవితఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బండారి శ్రీనుకు మేనమామ కూతురైన పోచంపల్లికి చెందిన బసవరేఖ((26)ను ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం పోచంపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ శ్రీను కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. శ్రీను తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకొని మద్యానికి బానిస అయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో 2020, ఫిబ్రవరి 23న భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. దీంతో జరిగిన విషయాన్ని బసవరేఖ తన తల్లిదండ్రులకు చెప్పి ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. అయితే అదే రోజు రాత్రి అత్తవారింటికి వచ్చిన శ్రీను తన పిల్లలను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా భార్య బసవరేఖ గట్టిగా నెట్టివేయడంతో తల గోడకు తగిలి కిందపడిపోయాడు. ఇదే అదునుగా భావించిన బసవరేఖ శ్రీను ముఖంపై దిండుపెట్టి ఊపిరాడనీయకుండా చేసి హత్య చేసింది. ప్రమాదవశాత్తు చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే మృతుడి అన్న బండారి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం ఈ కేసు విచారణకు రాగా భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు సాక్షాధారాలను పరిశీలించి, నేరం రుజువు కావడంతో నిందితురాలు బసవరేఖకు జీవితఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చింది. పూర్తి సాక్షాధారాలను సేకరించి నిందితురాలికి శిక్షపడేలా కృషిచేసిన పోలీసులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ వి. సత్యనారాయణ అభినందిస్తూ వారికి రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్(టీఎస్ 09 సీసీ 1083) పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కొద్దిసేపు హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న జీఎమ్మార్ హైవే సిబ్బంది ట్యాంకర్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


మౌలానా (ఫైల్)

హాలియా: రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం పాలైన ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట స్టేజీ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌కు చెందిన రైతు ఎండీ మౌలానా(62), తన కుమారుడు ఎండీ సర్వర్ కలిసి ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపేట స్టేజీ వద్ద కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి పక్కనే కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారి పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద హైవే పక్కన ఎండీ సర్వర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి వరి పొలం కోయడానికి కోత మిషన్ యజమానికి ఫోన్ చేస్తుండగా, జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎండీ మౌలానా తలకు తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు సర్వర్ తన తండ్రి మౌలానాను చికిత్స నిమిత్తం హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు సర్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కూర్చున్న చోటే వృద్ధుడి హఠాన్మరణం

- మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన


బస్టాండ్‌లోని కుర్చీలో విగతజీవిగా కొండయ్య, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: కుర్చీలో కూర్చున్న వ్యక్తి కుర్చీలోనే ప్రాణాలు విడిచిన సంఘటన మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన కొండయ్య(70)కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. శ్రీరామనవమి పండుగ సందర్భంగా గత నెల 29న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లిన కొండయ్య తిరిగి సోమవారం సాయంత్రం బస్సులో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్‌లో బాత్‌రూంకు వెళ్లి వచ్చిన అతడె వాటర్ బాటిల్ కొనుక్కొని నీరు తాగి అక్కడే కుర్చీలో కూర్చున్నాడు. అలా కూర్చున్న అతడు ఎంతసేపటికీ లేవకపోవడంతో ఇతర ప్రయాణికులు గమనించి ఆర్టీసీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని కొండయ్యను పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. అతడి వివరాలు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహన్ని తీసుకెళ్లారు. కాగా కొండయ్య వడదెబ్బతో లేదా గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు, బంధువులు భావిస్తున్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం : పోలీస్ శాఖలో పనిచేస్తూ అకాల మరణం పొందిన సిబ్బంది కుటుంబాలకు తెలంగాణ పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. గరిడేపల్లి పీఎస్‌లో ఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన జానకిరాములు కుటుంబ సభ్యులకు పోలీసు భద్రత ఇన్సూరెన్స్ స్కీం ద్వారా మంజూరైన చెక్కును సోమవారం ఎస్పీ తన కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. అంతకు ముందు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పోలీస్ గ్రీవెన్స్‌డేలో అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్ గౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, పోలీస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకం ధ్వంసం

మద్దిరాల: మండలంలోని కుక్కడం గ్రామపంచాయతీ పరిధిలోని దస్రూతండాలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని సోమవారం ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దస్రూతండాకు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో బెల్లం పానకం నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు దాడి చేసి సుమారు 200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎవరైనా తండాలల్లో సారా తయారుచేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హెచ్చరించారు.

‘నార్మల్’ పాల సేకరణ ధర పెంపు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: పాల ఉత్పత్తిదారులకు పాల సేకరణ ధరలను పెంచుతూ నార్మల్ డెయిరీ పాలకవర్గం నిర్ణయించినట్లు నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ (నార్మల్) చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హయత్‌నగర్‌లో జరిగిన పాలకవర్గ సమావేశంలో రైతుల సంక్షేమం కోసం పాల సేకరణ ధర పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. గేదెపాలు (కిలో వెన్నకు) రూ.756 నుంచి రూ.856కు, ఆవుపాలు (కిలో వెన్నకు) రూ.313 నుంచి రూ.353 పెంచామన్నారు. గేదెపాలు (6శాతం వెన్నకు) లీటరుకు రూ.45 నుంచి రూ.51కు అంటే లీటరుపై రూ.6 పెంచామని తెలిపారు. ఆవు పాలు (3శాతం వెన్నకు) లీటరుకు రూ.35.70 నుంచి రూ.40.25కి అంటే ప్రతి లీటరుపై రూ.4.55 చొప్పున పెంచామని వెల్లడించారు. ఈ పెంపు వెండర్స్ పాలకు వర్తించదని తెలిపారు. పెంచిన ధర ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు ఎ. గాల్‌రెడ్డి, కె. రాంరెడ్డి, డి. సోమిరెడ్డి, సీహెచ్. వెంకట్రాంరెడ్డి, పి. వెంకట్రాంరెడ్డి, కె. జయశ్రీ, సీహెచ్ సురేందర్‌రెడ్డి, ఆర్. లక్ష్మీనర్సింహారెడ్డి, కె. జలంధర్‌రెడ్డి, కె. అలివేలు, జి. శ్రీధర్‌రెడ్డి, కె. పాండు, జి. రాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందనపల్లిలో చిరుత పిల్లల సంచారం?

- రెండింటిని చూశామంటున్న రైతులు

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో చిరుతపులి పిల్లలు తిరుగుతున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దీంతో గ్రామంలో మళ్లీ కలవరం మొదలైంది. మార్చి 29న గ్రామ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డు వెనుక భాగంలో 5–6 ఏళ్ల వయస్సు కలిగిన మగ చిరుత పులి మృతదేహం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రెండు చిరుతపులి పిల్లలు సంచరిస్తున్నాయని రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుత పిల్లలు ఉంటే వాటి తల్లి కూడా ఉండే ఉంటుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు..

మగ చిరుత మరణించిన ప్రాంతానికి సమీపంలోని మామిడి తోటలో పిల్లలు తిరగడం, అనంతరం అవి వరిపొలం గట్టు మీద నుంచి వెళ్తున్నట్లు చూసిన రైతు సమీప గ్రామాల రైతులకు చెప్పినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. నీటి వసతితోపాటు వరిపొలాలు, మామిడి, బత్తాయి తోటలు, ఇతర చెట్ల పొదలు ఎక్కువగా ఉండటంతో అక్కడే పిల్లలు సంచారిస్తున్నాయనేది గ్రామస్తుల అనుమానం. అయితే రైతుల సమాచారంతో గ్రామానికి వెళ్లిన అటవీ శాఖ అధికారులు దీన్ని నిర్ధారించేందుకు మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల క్రితం మగ చిరుత మరణించిందని పిల్లలు ఉండే అవకాశం లేదని అధికారులు చెప్పి వెళ్లి పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో కూడా కొత్తగూడెం, శేషమ్మగూడెం ప్రాంతాల్లో చిరుతను చూసినట్లు రైతులు చెప్పినా అటవీ శాఖ అధికారులు తేలికగా తీసుకున్నారు. ఇటీవల చిరుత మృతదేహం వెలుగులోకి వచ్చిన తర్వాత అధికారులు నిర్ఘాంత పోయారు.

నిర్దిష్టంగా ఎవరూ చెప్పలేదు: కేఎస్.రెడ్డి

చిరుత పిల్లలను చూసిన వారు ఎవరూ నిర్దిష్టంగా చెప్పలేదని అటవీ శాఖ అధికారి కేఎస్.రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు. జిల్లాలో రాచకొండ అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడంతో అప్పుడప్పుడూ మర్రిగూడ మండల పరిధిలో కనిపిస్తాయన్నారు. చిరుత పిల్లలను చూసినవారు వెంనే మాకు సమాచారం ఇచ్చినట్లయితే అవి తిరిగిన ప్రాంతంలో వాటి పాద ముద్రలను సేకరించి కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దు

- డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌ఓ కోటాచలం హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ శిల్ప వినాయక ఆసుపత్రిలో అనుమతి లేకుండా 92 అబార్షన్‌లు చేసిందని తనిఖీ చేసి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సాయి దీప్తి నర్సింగ్ హోంలో డాక్టర్ డాక్టర్ దీప్తి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ అడ్డంగా దొరికిపోగా ఆస్పత్రికి రూ.20వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మధుబాబు ఆస్పత్రిలో 20 పడకలకు అనుమతి తీసుకొని 10 పడకలకే బయోమెడికల్ వేస్టేజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ తీసుకున్నారని తెలిపారు. శ్రీ నిధి నర్సింగ్ హోమ్‌లో గర్భిణికికి అబార్షన్ నిర్వహిస్తుండగా తనిఖీ చేసి ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేసి పోలీసు కేసు పెట్టినట్లు పేర్కొన్నారు. అలాగే సంజీవని ఆస్పత్రిని సీజ్ చేసి వారిపై పోలీసు కేసు పెట్టామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే పలు ఆస్పత్రులను కూడా సీజ్ చేశామని తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలో దివ్య నర్సింగ్ హోమ్, కోదాడ పట్టణంలో విజయ ఆసుపత్రి, అర్చన నర్సింగ్ హోమ్‌లో అబార్షన్‌లు చేస్తుండటంతో వీటిని కూడా సీజ్ చేశామని తెలిపారు. డాక్టర్ మధుబాబు మెడికల్ డిగ్రీని తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని తెలిపారు. ఈయన ఎండీ ఫిజీషియన్ వైద్యం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనుమతులు లేని ఆస్పత్రులు తప్పనిసరిగా వెంటనే తీసుకోవాలన్నారు. జిల్లాలోని వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, కొంత మంది వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు.

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుడికి మాయమాటలు చెప్పి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన పడిగోముల ఎల్లారెడ్డి ఈ నెల 1వ తేదీన యాదగిరిగుట్టకు వచ్చాడు. స్వామివారి దర్శనం అనంతరం 2వ తేదీన తిరిగి ఇంటికి వెళ్లేందుకు యాదగిరిగుట్ట బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఎల్లారెడ్డి బస్సు ఎక్కుతుండగా అతడి వద్ద ఉన్న డబ్బులు ఉండటాన్ని గమనించిన భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన అలకుంట్ల ఎంజర్, శైలజా అలియాస్ శాలు కూడా అదే బస్సులో ఎక్కారు. ఆ ఇద్దరు ఎల్లారెడ్డికి మాయమాటలు చెప్పి భువనగిరి మండలంలోని సురేంద్రపురి వద్ద బస్సులో నుంచి కిందకు దింపారు. సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి ఎల్లారెడ్డిని కర్రతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్‌ను లాక్కోని పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న భువనగిరి పోలీసులు రూరల్ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం రాయగిరి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, పోలీసు సిబ్బంది అశోక్‌రెడ్డి, నరేందర్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- పెద్దవూర మండలంలో కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు..
- త్రిపురారం మండలంలో సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొని మరొకరు..
- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు దుర్మరణం, తండ్రికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు


ప్రమాదానికి కారణమైన బస్సు

పెద్దవూర: కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన నెల్లూరి మధుసూదన్‌రావు అలియాస్ మధుబాబు(46) నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతడు తన భార్య మిర్యాలగూడలోని తల్లిగారి ఇంటి వద్ద ఉండటంతో కల్వకుర్తి నుంచి మిర్యాలగూడకు కారులో బయల్దేరాడు. పెద్దవూర మండలంలోని సంగారం స్టేజీ దాటాక పిన్నవూర గ్రామ శివారులో జడ్చర్ల -కోదాడ జాతీయ రహదారిపై అకస్మాత్తుగా మతిస్థిమితం లేని మహిళ కారుకు అడ్డుగా రావడంతో ఆమెను తప్పించి ముందుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వస్తూ కారును ఢీకొట్టింది. దీంతో మధుసూదన్‌రావు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య హిమబిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొట్టడంతో..

మోటకొండూర్: సైకిల్‌ని పాల వ్యాన్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మాటూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన భిక్షపతి ఆదివారం తన భార్య సత్తమ్మతో కలిసి సైకిల్‌పై వర్దూర్ గ్రామానికి వెళ్లి సాయంత్రం స్వగ్రామం వస్తుండగా మాటూర్ శివారులో ఎదురుగా పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ భిక్షపతిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సోమవారం మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని..


సైదయ్య (ఫైల్)

త్రిపురారం: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు మృతిచెందగా, తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మాటూరు గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. త్రిపురారం ఎస్‌ఐ శోభన్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగడప గ్రామపంచాయతీకి చెందిన తండ్రీకొడుకులు రేలా నరసింహ, రేలా సైదయ్య(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం కూలీ పని కోసం రాగడప నుంచి బెజ్జికల్ గ్రామానికి బైక్‌పై ఇద్దరూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అడవిదేవులపల్లి మండలానికి చెందిన ట్రాక్టర్ తుంగపహాడ్ నుంచి అడవిదేవులపల్లి వైపు వెళ్తుండగా మాటూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండా వద్ద వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేలా సైదయ్య, రేలా నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఇరువురిని మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో రేలా సైదయ్య మృతి చెందాడు. రేలా నరసింహ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రేలా సైదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రేలా అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాత్రి తోలే ట్రాక్టర్లు పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టుకొని అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బావ, బావమరిది మధ్య ఘర్షణ

- తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బావమరిది మృతి

నకిరేకల్: బావ, బావమరిదిని మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన బావమరిది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని చందంపల్లిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని యండ్లపల్లి గ్రామానికి చెందిన యానాల సాయికుమార్(24) తల్లి భిక్షమమ్మ తన అమ్మగారి ఊరైన నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామానికి వచ్చింది. సాయికుమార్ కూడా అమ్మమ్మ ఊరికి వచ్చాడు. ఇటీవల సాయికుమార్ నిత్యం మద్యం సేవిస్తూ తన తల్లి భిక్షమమ్మతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో భిక్షమమ్మ భర్త సైదిరెడ్డికి, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్న అల్లుడు యారాల విజయ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. సోమవారం యారాల విజయ్‌కుమార్‌రెడ్డి తన స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని తీసుకుని చందంపల్లికి వచ్చారు. సాయికుమార్‌కు విజయ్‌కుమార్‌రెడ్డి నచ్చజెపుతుండగా ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సాయికుమార్‌కు తలకు దెబ్బలు తగలడంతో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.